## భూములు ఇచ్చిన వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ మనుచౌదరి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
మల్లన్నసాగర్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరికి దశల వారిగా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. ప్రధానంగా అత్యవసరం ఉన్న వాటిపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ వాసుల నష్టపరిహారం, సమస్యలు, ఓపేన్ ప్లాట్లు అందజేత, ఆర్అండ్ఆర్‌లో మౌలిక వసతుల కల్పన,గుడి, బడులు, గజ్వేల్ రింగ్ రోడ్డు భూసేకరణపై కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో నిర్మించిన రెండు పడకల ఇండ్లను అసలైన లబ్దిదారులకు మాత్రమే అందించాలన్నారు.ఈ వారంలో ఆర్డీఓ నేతృత్వంలో ప్రస్తుతం ఇండ్లలో నివసిస్తున్న వారితో సమావేశం నిర్వహించి చర్యలు జరపాలని ఆర్డీఓకు సూచంచారు. జిల్లాలో రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణ భూమి విలువను లెక్కకట్టడం కోసం కమిటిని వేస్తున్నట్లు తెలిపారు. కమిటీలో అదనపు కలెక్టర్, ఆర్డీఓ,జాయింట్ రిజిస్టర్ అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్, రూరల్‌లో జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓలు సదానందం, బన్సీలాల్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీల చించివేతలో ఇరు పార్టీలపై కేసులు నమోదు : ఏసిపి మధు

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు క్యాంపు కార్యాలయంలో అక్రమంగా ప్రవేశించి ఫ్లెక్సీని చించివేసిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మధు శనివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అత్తు ఇమామ్, మహ్మద్‌గౌస్ ఉద్దీన్,నవాజ్‌బాబా, మున్నాలు కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి క్యాంపు కార్యాలయం అని రాసి ఉన్న ఫ్లెక్సీని చించివేయడంతో ఎమ్మెల్యే పిఎ శేషుకుమార్ ఫిర్యాధు మేరకు వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, ఎస్ఐ నరసింహారావులు కేసు నమోదు చేసి పరిశోధన చేస్తున్నారని ఏసీపీ మధు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పారీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన ఎర్రబాబు, తప్పేట పరుశురాంలపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా బిఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ తీయడానికి వెళ్లుచుండగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులను నెట్టివేసిన సామాల భాస్కర్,అరవింద్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, పెర్క బాబు తదితరులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. పట్టణంలోని పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన బిఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ వెంకట్, కంకటి నవీన్‌గౌడ్, సంధ్యబోయిన శ్రీకాంత్ యాదవ్ తదితరులపై కేసులు నమోదు చేసి పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు.




## అబద్దపు ప్రచారాలతో హరీష్‌రావు డ్రామాలు

**చిన్నకోడూరు, ఆగస్టు 17, ప్రభాతవారతన :**
అసత్యపు అబద్దపు మాటలు చెబుతూ నోరు ఉంది కదని ఇష్టమొచ్చి నట్లు మాట్లాడుతూ డ్రామాలాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో హరీష్‌రావు దిష్టిబొమ్మ నోటిలో ఫినాయిల్‌తో కడిగి ఇకనైనా అబద్దపు మాటలు మానుకోవాలని హితువు పలికారు. అనం తరం హరీష్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మీసం నాగరాజు యాదవ్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచి త వ్యాఖ్యాలు చేస్తే ఉరుకోమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపిస్తే ఇచ్చిన మాట ప్రకారం రాజీనామా చేయాల్సిన హరీష్‌రావు ఉద్దర మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీసం మహేందర్ యాదవ్, పర్శరాం, రాజు, అని ల్, జయంత్, ప్రశాంత్‌యాదవ్, ప్రశాంత్, వెంకట్, సంపత్, రాజు, రాజుగౌడ్, మహేష్, ఎల్లయ్య, నాగరాజు, స్వామి, రమేష్, గణేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** కలకత్తాలో డాక్టర్ మౌమితా దేబ్నాథ్‌పై జరిగిన అమానుష సంఘటనకు నిరసనగా శనివారం నారాయణఖేడ్ పట్టణంలో థానా, ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమానికి గుబ్బిపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైర్మన్ గుబ్బిపు మచ్చేందర్ సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుబ్బిపు మచ్చేందర్ మాట్లాడుతూ దేశంలో కొత్త కొత్త చాట్టాలు తీసుకువస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందని ఈ సంఘటన రుజువు చేస్తోందని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయడమే కాకుండా ప్రతి మహిళ తన వ్యక్తిగత భద్రత కొరకు వ్యాయామ విద్యను నేర్చుకునేలా ప్రభుత్వాలు మహిళలను చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో గుబ్బిపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చేందర్, తెలంగాణ ఆత్మ కమిటి డైరెక్టర్ అనుముల మారుతి, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ బాషిత్, కల్హేర్ మండల మాజీ ఎంపిపి అధ్యక్షులు గుబ్బిపు సుశీల అంజయ్య, నారాయణఖేడ్ మాజీ జడ్పీటిసి లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, నమ్లిమేట్ మాజీ సర్పంచ్ సత్యపాల్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు , దుద్రరం మాజీ సర్పంచ్ ప్రభాకర్, కంగ్టి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు గంగాం, ఆర్‌డిఓ, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ర్యాకల్ మాజీ సర్పంచ్ అంజయ్య, గీత పారిశ్రామిక సంగం తాలుకా డైరెక్టర్ శంకర్‌గౌడ్, అనంతసాగర్ మాజీ ఉప సర్పంచ్ నర్సింలు, పందరి, జ్ఞానేశ్వర్, గోపాల్‌రెడ్డి, విజయ్, జగదీష్‌పాటిల్, ఆంజనేయులు, ఫౌండేషన్ ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, అనుముల తుకారాం, మనోహర్, అభి పవర్, నాగల్‌గిద్ద మండల మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు పందరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో కలకత్తా డాక్టర్ మౌమితా దేబ్నాథ్‌పై అమానుష ఘటనకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీలో...**

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 17, ప్రభాతవార్త ః** కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ డిమాండ్ చేశారు. శనివారం నాడు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కళాశాలల విద్యార్థిని, విద్యార్థులతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శశికంత్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ అత్యాచారం ఎంతో బాధాకరం అన్నారు. అలాగే ఆ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకపోవడం, దుండగులు రౌడీలు పెరిగిపోయి ప్రభుత్వ అండతో మహిళలపై దాడులు చేయడం సరికాదన్నారు. డాక్టర్ అని చూడకుండా అతి కిరాతకంగా హింసించి, అత్యాచారం చేసిన నిందితున్ని వెంటనే ఉరితీయాలని వారు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను ఆపలేక పోతున్న చేతగాని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా నిందితులను వెంటనే కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, నాయకులు దీక్షిత్, హరి, వంశీ, అర్జున్, శ్రావణ్, భరత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట మెదక్ చౌరస్తావద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

# ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలి

**-జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి**
**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు17 ప్రభాతవార్త:**
ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ సుదర్శన్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా సవరణపై దిశానిర్దేశం చేయగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. హేతుబద్ధంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్-2025)లో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) ద్వారా ఇంటింటా జాబితాల పరిశీలన చేపట్టాలన్నారు. ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1వ తేదీల్లో కొత్త ఓటర్ల నమోదు చేపడుతున్నట్లు వివరించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆర్డీవోలను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణను అందించి ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. మార్గదర్శకాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు, చేర్పుల్లో ఎన్నికల కమీషన్ నిర్ధేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. జాబితా నుంచి మృతుల వివరాల తొలగింపునకు మరణ ధృవీకరణ పత్రం లేదా పంచనామా రికార్డులు తప్పనిసరిగా చూపాలని చెప్పారు. ఈ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో తప్పనిసిరగా సమావేశం ఏర్పాటు చేయాలని వివరించారు. ఓటరు జాబితాలో సాంకేతికంగా ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు సవరణ, మార్పులు చేర్పులు వంటివి చేపట్టి ఈ నెలాఖరులోఆ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గ్రామం, మండలం వారిగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి ఓటరు లీస్టులో పేర్ల నమోదు, వాటిలో మార్పులు, చేరనఉపలను చేయాల్సి ఉంటే పక్కాగా నిర్వహించాలని వివరించారు. అలాగే గ్రామాలు, వార్డుల్లో సంబంధిత అధికారులు పర్యవేక్షించే సమయంలో ఆయా చోట్ల చనిపోయిన ఓటర్లను గుర్తించి వారి వివరాలను ఓటరు జాబితా నుండి తొలగించాలని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించే ముందు వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి వారం రోజుల గడువు తరువాత పేర్లను తొలగించాలని, జాబితాలో ఫోటో తప్పుగా నమోదైన వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌పై వచ్చే ఆదేశాలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ శ్రీనివాస్, శివ్వంపేట తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఇతర ముఖ్య అధికారులు

## ఆడ పిల్లల పై దాడులకు పాల్పడితే చట్టరీత్యా శిక్ష


**-జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి అనిత**




**నర్సాపూర్ ఆగస్టు 17. ప్రభాతవార్త :**
ఆడ పిల్లల పై దాడులకు పాల్పడిన, అవమాన పరిచిన చట్టరిత్యా శిక్షించబడతారని అదేవిదంగా గ్రామీణ ప్రాంతంలో స్థిరాస్తులను చట్టబద్దంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెల్ల కాగితాలపై క్రయ విక్రయాలు చెల్లనేరవని జూనియర్ సివిల్ జడ్జి, మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌చైర్మన్, న్యాయమూర్తి కె.అనిత అన్నారు. శనివారం నర్సాపూర్ కోర్టులోమండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.ఈ సదస్సుకు హాజరైన జూనియర్ సివిల్ జడ్జి, మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌చైర్మన్ న్యాయమూర్తి కె.అనిత మాట్లాడుతూ... వివిద గ్రామాల నుండి వచ్చిన వ్యక్తులకు చట్టాల పైన అవగాహన కల్గిస్తు ఆడ పిల్లల పై దాడులకు పాల్పడిన, అవమాన పరిచిన చట్టరిత్యా శిక్షించబడతారని అన్నారు.అదేవిదంగా గ్రామీణ ప్రాంతంలో ని వారికి చట్టాల పైన అవగాహన లేక స్థిరాస్తులను క్రయవిక్రయాలను తెల్ల పేపర్ల పైన రాసుకుంటు తరచు పలు వివిదాలతో మండల్‌లీగల్ సర్వీస్ ను సంప్రదించి తగు న్యాయం చేయాలని ఆశ్రయిస్తున్నారని తెలిపారు.స్థిరాస్తుల క్రయ విక్రయాలను చేసినప్పుడు తప్పకుండ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తద్వార ఎటువంటి తగాదాలు తలెత్తవని అన్నారు.అనంతరం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వార పలు పిఎల్‌సి కేసులను పరిష్కరించడం జరిగింది ఈకార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది,వివిద గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కెసిఆర్ కాలనీలో పొంగి ప్రవహిస్తున్న మురికి నీరు


**-పొంచి ఉన్న వ్యాధులు....ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు**



డ్రైనేజీ నిండి మురికి నీరు సెలయేరుల పారుతున్న దృశ్యం

**రామాయంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త ః**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడంతో అక్కడి కాలనీ వాసులు ప్రతిరోజు అనేక అవస్థలకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. డబుల్ బెడ్‌రూమ్‌లో నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకమైన పైపులు వాడడం వల్ల అవి పగిలిపోతూ తరచుగా డ్రైనేజీ సమస్యలు ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ పైపులు పగిలి అవి పొంగడం...మురికి నీరు ఇండ్ల మధ్యనుండి సెలయేరుల పారుతుంది. మురికి నీటిలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తుంది. పలుమార్లు కాలనీవాసులే వారి సొంత డబ్బులను వెచ్చించి పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్త పైపులను ఏర్పాటు చేసుకున్నారు. అయినా తరచుగా డ్రైనేజీ పైపులు పగలడం....పగిలిన పైపులు నుండి మురికి నీరు పొంగడం ఈ కాలనీలో సర్వసాధారణమైపోయింది. గతంలో ఈ విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు మరమ్మత్తులు చేశారని, ప్రస్తుత వర్షాకాలంలో మళ్లీ సమస్య మొదటికి వచ్చినట్లు తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కూడా కాంట్రాక్టర్ సక్రమంగా చేయలేదు. సెప్టిక్ ట్యాంకులు నిర్మించారే తప్ప వాటికి గ్యాస్ పైపులు ఏర్పాటు చేయలేదు. దీంతక్ష సెప్టిక్ ట్యాంకుల నుండి భరించలేని దుర్వాసన వ్యాపించడంతో అప్పట్లో కాలనీవాసులు మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి, గ్యాస్ పైపులు నిర్మించి కొంత వరకు దుర్వాసన రాకుండా చేయగిగారు. ప్రస్తుతం మాత్రం కాలనీలో డ్రైనేజీ సమస్య అధికాంగా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఒకవైపు ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, కేసీఆర్ కాలనీలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. కేసీఆర్ కాలనీలో ఒక్క డ్రైనేజీ సమస్యనే కాకుండా రోడ్లు, పలుసమస్యలు కాలనీ వాసులను వెంటాడుతున్నాయి. కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికీ పలుమార్లు కాలనీవాసులు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి తీసుకుపోయారు. చిన్న చిన్న సమస్యలు పరిష్కారం అవుతున్నా...మేజర్ సమస్యలు మాత్రం అలాగే ఉండిపోతున్నాయి. ఇప్పటికైనా కేసీఆర్ కాలనీలో తిష్ట వేసిన సమస్యల విషయంలో ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**కొల్చారం, ఆగస్టు17 ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులతో ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ ప్రకటించడంతో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి రైతులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మారెల్లి అనిల్ మాట్లాడుతూ దేశం గర్వించే విధంగా రైతుల ముఖాల్లో సంతోషాన్ని నింపి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే అని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదవరెడ్డి, శేఖర్, కార్తీక్, భూమయ్య, శివయ్య, అమృతి, దుర్గయ్య, సంగయ్య, శ్యామయ్య, సురేందర్, మల్లేశం, బేథయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నుండి ప్రజలను కాపాడండి



హుస్నాబాద్ పట్టణంలో వీధి కుక్కల దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్,ఆగస్టు17,ప్రభాతవార్త**
వీధి కుక్కల నుండి హుస్నాబాద్ పట్టణ ప్రజలను మున్సిపల్ అధికారులు,పాలకవర్గం కాపాడాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం రోజున పట్టణ కేంద్రంలో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాదితులనుతమ పార్టీ శ్రేణులతో కలసి పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న హుస్నాబాద్‌లో ప్రజలకు కుక్కల బారినుండి రక్షణ కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారన్నారు. వీధుల్లో కుక్కల బారి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని పలుమార్లు కమిషనర్,సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వెంటనే కుక్కలను పునరావాస కేంద్రాలకు తరలించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు.లేని పక్షంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేటకు సేవ చేస్తా

**-బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట కీర్తి ప్రతిష్టాలు పెంచితే**
**-కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాచకపాలన సాగిస్తుంది**
**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**
పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తాను సిద్దిపేట కీర్తి ప్రతిష్టలను పెంచితే. .ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏలా దిగజారుస్తుందో మీరే ఆలోచించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదోగ్య విరమణ పొందిన జీవిత సభ్యులకు, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 11 మండలాల విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటలో ఏనాడు అరాచకాలకు పాల్పడలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అరాచకాలకు పాల్పడడమే పనిగా పెట్టుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేటకు ఇచ్చిందిమేలేదు కానీ ఉన్నవి తీసుకుపోతుందన్నారు. వెటర్నీ కళాశాలను కొడంగల్‌కు తీసుకెళ్లారని శిల్పారాం, రంగనాయకసాగర్ పార్కు పనులను నిలిపి వేశారని తెలిపారు. కాంగ్రెస్ అరాచకశక్తులన వేధావులు, విజ్ఞులు ఆలోచించాలన్నారు. నాలో ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లా గత కొన్నియేండ్ల నుంచి రాష్ట్రంలనే నంబర్‌వన్‌గా నిలుస్తువస్తుందన్నారు. కేవలం సిద్దిపేట నియోజకవర్గంలోనే టెన్త్‌లో 75 మంది విద్యార్థులు 10 జిపిఎ సాధించారని తెలిపారు. సిద్దిపేట ఎన్జీవో భవన్ రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఏ సంస్థ, సంఘం అయినా సామాజిక సేవ కార్యక్రమాలతోనే గుర్తింపు వస్తుందన్నారు. పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అంజయ్య, విక్రమ్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డా॥యాదవరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, బాలకిషన్, గజ్వేల్-ప్రెజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్తా, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు సాయిఈశ్వర్‌గౌడ్, గాదగోని అనంద్‌గౌడ్ పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

## వాహన కాగితాలు తప్పని సరిగా ఉండాలి

**- ఎస్ఐ విజయ్‌కుమార్**

**కంగ్టి, ఆగస్టు 17 ప్రభాతవార్త:**
ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్స్‌రెన్స్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని కంగ్టి ఎస్.ఐ. విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కంగ్టిలోని సుభాష్ చంద్రభోస్ కూడలి వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే చోదకులకు తప్పకుండా ఆర్‌సి. ఇన్సూరెన్సు హెల్మెట్ తప్పక ధరించి ఉండాలని ఆయన అన్నారు. మైనార్ పిల్లలు ద్విచక్ర వాహనం నడిపితే వారికి జైలుపు పంపడం జరుగుతుందని అన్నారు వాహన చోదకులు ఇతరులకు వాహనాలు ఇచ్చిన వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఇంటి ముందు యజమానులు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని పంట పొలాల్లో గంజాయి పంటను సాగు చేస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడ బిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మీ



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** ఆడ బిడ్డల పెళ్లిలకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులు అండగా నిలుస్తున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జిన్నారం గ్రామ పరిధిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 117 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 17లక్షల రుపాయల విలువైన చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ చైర్మన్ రోజా బాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్డే క్రిష్ణ, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో ఓపి సేవలు బంద్

-కోల్‌కతాలో వైద్యురాలి ఘటనపై డాక్టర్ల ఆందోళన
-నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిపివేత
-పలుప్రాంతాల్లో రోగులకు తప్పని ఇబ్బందులు




**హైదరాబాద్, ఆగస్టు 17,ప్రభాతవార్త:** కోల్‌కతాలో పిజీవైద్యురాలిపై హత్యాచార ఘటన సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఈ దుర్ఘటకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దేశవ్యాప్తంగా 24గంటల పాటు అన్ని ఆసుపత్రుల్లో ఓపి సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. ఈనేపథ్యంగా నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో ఓపి సేవలు నిలిపివేసి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో వైద్యులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు. వీరిని పలువురు రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. ఇక వైద్యులే కాకుండా వైద్య సుబంధ వర్గాలైన నర్సుల సంఘాలు, ఇతర వైద్యసంఘాలు కూడా ఈసమ్మెకు మద్దతు ప్రకటించాయి. ప్రధాన ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియా ఓపి బ్లాకుల దగ్గర తక్కువ హడావిడి కనిపించింది. అత్యవసర, కాజువాలిటీ, ఇన్‌పేషెంట్ విధులకు హాజరైన వారు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి వచ్చారు. అలాగే ఫీవర్ ఆసుపత్రిలో వైద్యులు నిరసన తెలిపారు. సనత్ నగర్ ఈఎస్ఐసి వైద్యకళాశాల విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఆవరణం నుంచి అమీర్‌పేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అలాగే నీలోఫర్, నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రుల వద్ద వైద్యులు ఆందోళన చేశారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరగాలి.. నింధితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. సికింద్రాబాద్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు. పరేడ్ మైదానం నుంచి క్లాక్‌టవర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టి బాధిత వైద్యురాలికి సత్వర న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. అలాగే కెపిహెచ్‌బిలో గాంధీ విగ్రహం వద్ద వైద్యుల ఆందోళన కొనసాగింది. వైద్య సిబ్బందికోసం కొత్తచట్టాలను తేవాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 9రోజులువుతుందని ..నిరసన చేపట్టి నాలుగురోజులైనా ప్రభుత్వాలు స్పందించడంలేదని వాపోయారు.

**రోగులకు తప్పని ఇబ్బందులు..**

పలు ప్రాంతాల్లో సమ్మె గురించి సమాచారం లేని రోగులు ఆసుపత్రులకు వచ్చి వెనుదిరిగారు. దీంతో నగరంలోని ప్రధాన ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియా,ఫీవర్, నిమ్స్ ఆసుపత్రుల వద్ద వైద్యులు నిరసనల్లో ఉండటంతో చాలామంది అక్కడి ప్రాంగణాల్లో చూడకతప్పలేదు. అత్యవసర విభాగాల్లోనూ సిబ్బంది సరిగా లేకపోవడంతో అక్కడక్కడ రోగులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. కొన్ని ఆసుపత్రుల్లో ఆసుపత్రులకు వచ్చిన రోగుల్లో పరిస్థితి బాలేనివారికి నిరసన తెలుపున్న వైద్యులు అక్కడే వైద్యం చేశారు

## అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**దుండిగల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** అబద్దపు మాటలతో, అసత్య ప్రచారపు పునాదులపై కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భౌరంపేట, దుండిగల్ రైతులతో కలిసి గండిమైసమ్మ చౌరస్తాలోని 'ది హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ ' బ్యాంకు ముందు నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల అనంతరం డిసెంబర్ 9లోపు అందరికి రుణమాఫీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ,2లక్షల రుణమాఫీ చేశామని చెబుతూ రైతాంగాన్ని నట్టేట ముంచిందన్నారు. భౌరంపేట, దుండిగల్ ప్రాంతాలకు చెందిన 632మంది రైతులు ఈబ్యాంకులో రుణం పొందితే కేవలం 14మంది రైతులకు రూ,4.30లక్షలు మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. మిగితా 618మంది రైతులకు రూ,2.95కోట్ల రూపాయలు రుణమాఫీ జరగలేదని వెంటనే సదరు రైతాంగం రుణమాఫీ చేయాలని లేని యెడల రైతాంగానికి సిఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రాష్ట్రవ్యాప్తంగా పత్తాకులేదని, రుణమాఫీ డిసెంబర్ 9 నుండి ఆగస్టు 15లోగా తెలంగాణ రైతులందరికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మాయమాటలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో కేవలం ఐదుశాతం మంది రైతులకు మాత్రమే చేసిందన్నారు. ఇప్పటికైనా మోసపూరిత మాటలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## టిటిడిలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

**సైఫాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** హిమాయత్ నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శనివారం నాటి మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. 14వ తేదీన అంకు రార్పణతో ప్రారంభమైన ఈ పవిత్రోత్సవాలు 15, 16 తేదీలలో దేవాలయంలో హోమాలు, అభిషేకాలు, వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. నేడు మహా పూర్ణాహుతి, కుంభ సంరక్షణతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో డోనర్ రామిరెడ్డి, అరుణ్‌కుమార్ దంపతులు, టిటిడి ఉద్యోగులు శ్రీనివాస్ ప్రభు, మణికంఠ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఉదయం అల్పాహా రం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. పవిత్రోత్సవాలను పురస్కరిం చుకుని దేవాలయాన్ని పూలమాలలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

# పాతబస్తీ మెట్రోకు కత్తిమీద సాముగా ఆస్తుల సేకరణ

## - ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్ల జారీ

**హైదరాబాద్,ఆగస్టు 17 ప్రభాతవార్త**

పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఆస్తుల సేకరణ కత్తిమీద సాముగా మారనుంది. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టకేలకు ఒక అడుగు ముందుపడింది. ఈ నేపథ్యంలో అతికష్టం మీద పాతనగరంలో మెట్రో ప్రాజెక్టు కోసం 100 ఆస్తుల సేకరణకు ఇటీవల హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ద్వారా భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మొత్తం 7.5కి.మీ.మేర నిర్మించే పాతనగరం మెట్రో మార్గంలో సుమారు 1100 ఆస్తుల సేకరణ చేపట్టాల్సి ఉన్నదని, ఇందుకోసం రూ.1100 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని మెట్రో అధికారులు తెలిపారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తరణను పరిగణలోకి తీసుకొని ఆస్తులను గుర్తించామని, దీంట్లో చిన్నపాటి ఇండ్లు ఉండటం వల్ల సేకరించాల్సిన ఆస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో దశలవారీగా 100-200 ఆస్తులకు ఒక నోటిఫికేషన్ చొప్పున జారీ చేయనున్నారు.ఎంజీబీఎస్ నుంచి చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణ గుట్ట వరకు 7.5 కి.మీ మేర చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్టు కోసం భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోంది. మెట్రో అలైన్‌మెంట్‌లో ప్రస్తుతం రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువ ఉంది. కొన్ని చోట్ల 30-40, మరికొన్ని చోట్ల 60ఫీట్ల కంటె ఎక్కువ రోడ్డు మార్గంలేదు. దీంతో మెట్రో మార్గాన్ని సాఫీగా నిర్మించాలంటే 80-100 అడుగుల మేర విస్తరించాల్సిన అవసరం ఉన్నది.

**మెట్రో పనులకు మట్టి పరీక్షలు..**

సాంప్రదాయిక సర్వేతో పాటు దారుల్-షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్‌ల మధ్య ఇరుకైన మార్గంలో రహ



దారి విస్తరణ, మెట్రో స్టేషన్‌ల నిర్మాణానికి అవసరమైన ప్రభావిత ఆస్తులకు సంబంధించిన ఖచ్చితమైన కొలతలు తీసుకోవడానికి ఇప్పటికే డ్రోన్ సర్వే కూడా నిర్వహించారు. 21 మసీదులు, 12 దేవాలయులు, 12 అషూర్ ఖానాలు, 33 దర్గాలు, 7 సమాధి యార్డులు, 6 చిల్లాలతో సహా దాదాపు 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలను రక్షించడానికి తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలను రూపొందించడంలో డ్రోన్ సర్వే సహాయం ఉపయోగపడనుంది. మెట్రో అలైన మెంట్, పిల్లర్ లోకేషన్‌లు తదితర వాటిని ఈ మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపని విధంగా ప్లాన్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అదే సమయంలో మట్టి పరిశోధన ప్రారంభించారు.ఫలక్‌నుమా మెట్రోస్టేషన్ ఉన్న చివరి స్టేషన్ నుంచి భూసార పరిశోధనలు కొనసాగుతున్నాయి.

**మెట్రోరైల్ నిర్మాణం పూర్తయితే....**

పాతబస్తీ మెట్రోరైల్ కారిడార్ పనులు పూర్తయితే ఓల్డ్‌సిటీలో వ్యాపారాలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. ఇక్కడ అనేక రకాల వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు పాతబస్తీలో ఉన్న వ్యాపారాలతో ముడిపడి ఉన్న వ్యాపారాలు అనేకం ఉన్నాయి. శుభాకార్యాలు, పండుగల సమయాల్లో ఇతర ప్రాంతాల నుండి లక్షలాధి మంది పాతబస్తీలో వస్త్రాలు, గాజులు లాంటి వాటితో పాటు నిత్యవసర సరుకులు అతి తక్కువ ధరకు దొరుకుతుండడంతో కొనుగోలు చేయడం కోసం వస్తుంటారు. దీంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో నుండే కాకుండా దేశంలోని అనేక ప్రాంతాలలో పాటు విదేశాల నుండి కూడా ఇక్కడి పర్యాటక ప్రాంతాలను సందర్శించడం కోసం అనేక మంది వస్తుంటారు. వీరిలో ఎక్కువశాతం జనాలు వ్యయప్రయాసకోర్చి బస్సులు, ఇతర వాహనాలలో వస్తుంటారు. మెట్రోరైల్ పనులు పూర్తయితే వ్యాపారాలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుంది.

# మోసకారి మాటలు..జీవితాలతో ఆటలు




-ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు కుచ్చుటోపి
-లక్షల ప్యాకేజీలతో వల..
కొద్దిరోజులకు బోర్డు తిప్పేస్తున్న సంస్థలు
-వరుసఘటనలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో భయం భయం

**హైదరాబాద్, ఆగస్టు 17,ప్రభాతవార్త :** గతంలో సైబర్ నేరాలు అనగానే గుర్తుకొచ్చే పేరు నైజీరియన్లు..సైబర్ నేరాలు చేయడంలో వారిని మించినోళ్లు లేరు.అలాంటిది ఇప్పుడు మనదేశంలో రోజుకో కొత్తరకం నేరగాళ్లు పుట్టుకొస్తున్నారు. వీరు చేస్తున్న మాయ..మోసం చూస్తే మనవాళ్ల మోసాలముందు నైజీరియన్లు బలాదూర్ అనిపించక మానదు. అలా కొత్త కొత్త మోసాలతో కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు నగరంలో ఎంతో మంది అమాయకులు,నిరుద్యోగులు ఈమోసగాళ్ల భారిన పడి లక్షల రూపాయలు పోగొట్టుకొని చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మాదాపూర్‌లో మారోసాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ వందఫీట్ రోడ్‌లో ఫ్రైడే అఫ్‌కన్సల్టెన్సీ పేరుతో కంపెనీ దాదాపు 600పైబడిన ఉద్యోగుల నుంచి రూ.1లక్ష ,రూ.50వేలు చొప్పున వసూలు చేసింది. ట్రైనింగ్ ఇచ్చించి జాబులు ఇప్పిస్తామంటూ నమ్మించిన కంపెనీ ప్రతినిధులు దాదాపు 10కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. శిక్షణ అనంతరం ప్లేస్మెంట్ ఇప్పిస్తామంటూ నమ్మించి టోపీ పెట్టారు. ఇటీవల కార్యాలయానికి తాళం వేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు మాదాపర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరికి బెంగళూరు, విజయవాడ కేంద్రాలుగా మరిన్ని బ్రాంచీలు ఉన్నట్లు సమాచారం. అలాగేఇటీవల బిటెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్న ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ నిరుద్యోగులను నిలువునా ముంచింది. చేసిన ఉద్యోగానికి జీతం చెల్లించకపోగా, పలువురు ఉద్యోగుల పేరు మీద లోన్లు తీసుకున్న సాఫ్ట్‌వేర్ సంస్థ చివరికి బోర్డు తిప్పేసింది. సంస్థ చేతిలో మోసపోయిన ఉద్యోగులు గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గచ్చిబౌలిలోని ట్యూరింగ్ మైండ్స్ ఏఐ టెక్నాలజీ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు పలు రాష్ట్రాల్లోని బిటెక్, డిగ్రీ విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక చేసింది. అందులో బిటెక్ పూర్తి చేసిన వారికి 6.2లక్షల ప్యాకేజీ, డిగ్రీ పూర్తి చేసిన వారికి 5.2లక్షల ప్యాకేజీ చొప్పున ఆఫర్ లెటర్లు ఇచ్చింది. మొదట గచ్చిబౌలి కార్యాలయంలో 9 నెలల పాటు ట్రైనింగ్ ఉంటుందని చెప్పి 700మందిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. ఎంపికైన విద్యార్థులు గతకొన్ని నెలలుగా గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ సంస్థలో మూడు బ్యాచ్‌లుగా ట్రైనింగ్ తీసుకుంటూ స్థానికంగా ఉంటున్నారు. కాగా ట్రైనింగ్ మొదటి నెలలోనే ఇందులో 60మంది ఉద్యోగుల పేరుతో ఒక్కక్కరి మీద 4లక్షలు, మరో 50మంది ఉద్యోగుల పేరుతో ఒక్కక్కరి మీద 10 లక్షల చొప్పున ఆసంస్థ ప్రైవేటు బ్యాంకుల్లో లోన్లు తీసుకుంది. మరోవైపు ఉద్యోగులకు ప్రతినెల మొదటివారంలో స్టైఫండ్ పేరుతో 10వేల రూపాయలను అకౌంట్లలో జమ చేయగానే, వెంటనే లోన్ల పేరుతో ప్రైవేటు బ్యాంకులు సదరు డబ్బును కట్ చేసుకుంటున్నాయి. ఈ విషయమై ఉద్యోగులు సంస్థ ప్రతినిధుల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రతిసారి ఏదో సాకుతో సంస్థ ప్రతినిధులు కాలం వెళ్లబుచ్చారు. ఈనేపథ్యంలోనే తమ వద్ద ప్రాజెక్టులు లేవని, అందరు ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామంటూ ఆ మెయిల్స్ పెట్టింది. దీంతోవందలాది ఉద్యోగులు గచ్చిబౌలి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు.అలాగే గతేడాది హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఫన్‌ల్యాబ్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బిటెక్ ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలిస్తామంటూ వందలాది మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ఒకొక్కరి నుంచి 50వేల నుంచి 80వేల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చిన నెలరోజుల్లోనే సంస్థ చేతులెత్తేసింది.

## హుసేన్‌సాగర్‌లో నిమజ్జనం కోర్టు ఆదేశాల ప్రకారమే వెళ్దాం : మంత్రి పొన్నం ప్రభాకర్

-ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
-ప్రజల సహకారం ఉంటే గణేజ్ నిమజ్జనం శాంతియుతంగా జరుగుతుంది

**పంజగుట్ట, ఆగస్టు 17 (ప్రభాతవార్త):** హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాలు నిర్వహించి తీరుతామని నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గణేజ్ ఉత్సవాల నిర్వహణపై బంజారాహిల్స్‌లలోఎని కమాండ్ కంట్రోల్ రూంలో వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ప్రజా ప్రతినిధులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.ముందస్తు చర్యలలో భాగంగా శనివారం ఇంటర్నల్ డిపార్ట్‌మెంట్ కోవార్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మధ్యనే జరిగిన బోనాల ఉత్సవాలను నగరంలో ప్రజల సహకారంతో ఎంతో ప్రశాంతగా నిర్వహించుకున్నామని, గణేష్ ఉత్సవాలను, నిమజ్జనాన్ని కూడా అంతే ప్రశాంతతో జరుపుకోవాలని, దీనికి నగర ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు.గతంలో జరిగిన చిన్న చిన్న లోటుపాట్లు ఈ యేడాది జరుగకుండా చూస్తామని తెలిపారు. దేశంలో ముంబై తరువాత గణేష్ ఉత్సవాలు గ్రాండ్‌గా జరిగేది హైదరాబాద్‌లో మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. హుసేన్‌సాగర్‌లో నిమజ్జనం అంశం కోర్టు ఆదేశాల ప్రకారం ముందుకు పోతామని తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తర్వాత ఆన్లైన్‌లో అప్లై చేసుకోవాలని ఆయన సూచించారు. తద్వారా ఎన్ని విగ్రహాలు, ఉన్నాయి, వాటికి వాహనాలు ఎలా సమకూర్చుకోవాలో పూర్తి సమాచారం ఉంటుందన్నారు. నిమజ్జనం సమయంలో వాహనాలను ఎక్కడా ఆపకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నగర వ్యాప్తంగా వేలాది విగ్రహాలు నిమజ్జనానికి తరలించే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులతో పాటు నిర్వాహకులపై కూడా ఉందన్నారు. ఎన్ని చేసినా అధికారులకు ప్రజల సహకారం ఉంటేనే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ బ్రహ్మాండమైన కార్యక్రమం విజయవంతం కాగలదని అయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తరుపున కూడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సకల చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో నగర పోలీసు కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

# బైక్ దొంగలను పట్టుకున్న ఓ.యూ పోలీసులు

**తార్నాక, ఆగస్టు 17 ప్రభాతవార్త:** బైకులను చోరి చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగలను ఓ.యూ పోలీసులు అరెస్టు చేశారు వారి వద్ద నుంచి బైకులను స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు దొంగలు చోరి చేసిన వివరాలను శనివారం ఓ.యూ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇన్స్‌పెక్టర్ రాజేందర్ వెల్లడించారు. తార్నాకలో నివాసముండే యాసిన్ అలి సిద్దిఖి ఈ నెల 4న రాత్రి తన స్వగ్రామానికి వెళ్లుతూ తన యమహా బైకును తార్నాక మెట్రో స్టేషన్ వద్ద పార్కు చేసి వెళ్లాడు. తిరిగ ఉదయం వచ్చిచూడగా తన బైకు కనిపించలేదు. ఫిర్యాదు అందుకున్న ఓ.యూ పోలీసులు విచారణ ప్రారంభించారు. సీసీ పుటేజీల సహాయంతో నిందితులను నిజాంపేట్‌లో అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన దివ్వల లాజరు అలియాస్ రాము(19) కోనేటి రాజేష్ (19)లు స్నేహితులు. వీరిద్దరు ఉపాది కోసం నగరానికి వచ్చి జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీగా మని సంపాదించాలనే అత్యాషతో బైకులను దొంగతనం చేసి విక్రయించాలను కున్నారు. ఈ క్రమంలో తార్నాకలో, కాకినాడాలో మరో బైకులను చోరి చేసి తక్కువ ధరకే విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు విస్వసనీయ సమాచారంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు.


నిందితులను చూపిస్తున్న ఓ.యూ పోలీసులు

**మరో ఘటనలో ....** చోరీలకు పాల్పడుతున్న కుటుంబ సభ్యులు అరెస్టు

భార్య, భర్త,తమ మైనర్ కుమారుడు అతడి స్నేహితుడితో కలిసి పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేసి తప్పించుకొని తిరుగుతున్న వారిని ఓ.యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈ రెండు వేర్వేరు ఘటనలో నిందితుల నుంచి పోలీసులు 13 బైకులను స్వాదీనం చేసుకున్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం : తలసాని



**బేగంపేట ఆగస్టు 17,ప్రభాతవార్త**

సనత్‌నగర్ నియోజకవర్గంలో బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనే దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శనివారం బేగంపేట డివిజన్ పరిధిలోని బ్రాహ్మణవాడీ పోస్ట్ ఆఫీసు వద్ద ఉన్న జయంత్ అపార్ట్‌మెంట్ పరిసరాలలో వివిధ శాఖల అధికారులతో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి సమస్యలు అడిగి తెల్సుకున్నారు.తమకు సరైన సీవరేజ్ లైన్ లేకపోవడం వలన వర్షపు నీరు నిల్చిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి నూతన సీవరేజ్‌లైన్ ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా కాలనీలో అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.తరచుగా సీవరేజ్ లీకేజిల వలన కూడా ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేసారు.ఎయిర్‌టెక్ మిషన్ లను వినియోగించి మ్యాన్ హోల్స్‌ను క్లీన్ చేయాలని తద్వారా లీకేజీ సమస్యను పరిష్కరించాలని చెప్పారు.తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు ముందు బేగంపేట నాలా పరిసర ప్రాంతాలు ముంపుకు గురయ్యేవని,కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్న విషయాన్ని గుర్తు చేసారు.ఎస్ ఎన్ డి పి కార్యక్రమం ద్వారా సుమారు 45కోట్ల రూపాయల వ్యయంతో నాలాలో పూడిక తొలగింపు,పరిసర బస్తీలలో సీవరేజ్‌లైన్‌లు,రోడ్ల నిర్మాణం చేపట్టి ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేసినట్లు వివరించారు.త్వరలోనే ఈ ప్రాంత ప్రజల సమస్యను కూడా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తలసాని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి,వాటర్‌వర్క్స్ డీజీఎం అశీష్, ఏ ఈ వెంకట్‌రెడ్డి,జీహెచ్ఎంసీ ఏఈ నవీన్,శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ సాగర్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,నాయకులు టి.శ్రీహరి,డి.వి.నరేందర్ రావు,శేఖర్,ఆరీఫ్,శ్యాంసుందర్,వాహెద్,కాలనీకి చెందిన రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానంతో భార్యపై భర్త కత్తితో దాడి


**మెహిదీపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త :** అనుమానంతో ఓ వ్యక్తి భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం ఆసీఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన వసంత్ (53)కు గత 15 సంవత్సరాల క్రితం మొదటి వివాహం జరుగగా మొదటి భార్య అనారోగ్యానికి గురి కావడంతో కర్ణాటకు చెందిన జ్యోతి (29)ని ఏడాది క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగిన అనంతరం కొన్ని నెలలుగా సీతరాంబాగ్‌లో నివాసం ఉండి రెండు నెలల క్రితమే హుడా కాలనీకి మకాం మార్చాడు. వసంత్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య జ్యోతి మాత్రం ప్రైవేట్ ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. ఇదిలా ఉండగా మద్యానికి బానిసైన వసంత్ భార్యపై అనుమానం పెంచుకొని ఈనెల 16న అర్ధరాత్రి 12 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రాణభయంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా జ్యోతి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది.వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జ్యోతిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉండగా, పోలీసులు వసంత్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## తెలంగాణ ఐకాన్‌గా సచివాలయం ఉద్యోగి


తెలంగాణ ఐకాన్ అవార్డుతో తులసీదాస్‌ను సత్కరిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, మామిడిహరికృష్ణ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఒకవైపు ప్రభుత్వ సచివాలయ ఉద్యోగిగా సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తూ మరోపక్క సామాజిక సేవకుడిగా సమాజానికి విశేష్ట సేవలందిస్తున్న జి.తులసీదాస్‌మాంగ్‌ను ప్రతిష్టాత్మక తెలంగాణ ఐకాన్ అవార్డు వరించింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలంగాణ వాయిస్ స్టూడియో, తెలంగాణ థియేటర్ మీడియా రిపర్టీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బిగ్‌రీల్స్ 25వ సంచిక ఆవిష్కరణోత్సవంలో ముఖ్యఅతిథులుగా టీజిఐఐసి ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, బి.రమేష్‌కిషన్ గౌడ్ తదితరుల చేతులమీదుగా తులసీదాస్‌ను ఘనంగా సత్కరించి తెలంగాణ ఐకాన్ అవార్డ్ 2024 ప్రదానంచేసి ఎంతగానో ప్రశంసించి శుభాభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అత్యున్నత పరిపాలనా కేంద్ర కార్యాలయం సచివాలయంలో ఒక సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ హెల్పింగ్ హాండ్స్ చారిటీని ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యపరుస్తూ, ప్రతిభావంతులైన పేదవిద్యార్థుల ఉన్నత విద్యకోసం ఆపన్నహస్తం అందించడం అనితరసాధ్యమని వారు ప్రశంసించారు. మున్ముందు మరిన్ని గొప్పసేవలందించాలని సూచించారు.

## మెట్రో భవన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన




**బేగంపేట ఆగస్టు 17,ప్రభాతవార్త**

మెట్రో రైళ్ల రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలని కోరుతూ శనివారం బేగంపేట మెట్రో భవన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రోజుకు 5లక్షలకు పైగా ప్రయాణీకులు మెట్రో రైళ్లలో ప్రయాణం చేస్తున్నారని,నిలబడే స్థానం కూడా లేకుండా ప్రయాణించాల్సి వస్తుందని,రద్దీ పెరిగితే 3 కోచ్‌ల నుంచి 6కోచ్‌లకు పెంచుతామంటూ ఎల్ అండ్ టీ అధికారులు గతంలో చెప్పారని,అందుకు అనుగుణంగా కోచ్‌లు పెంచాలన డిమాండ్ చేసారు.ఎల్ అండ్ టీ కి లాభాలు తప్ప ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని,కొన్ని స్టేషన్లలో ఇప్పటి వరకు ఫ్రీగా ఉన్న పార్కింగ్ స్థలాలకు ఇప్పుడు టాయ్‌లెట్స్,పార్కింగ్‌కు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని,కేంద్ర మంత్రి,ముఖ్యమంత్రి చొరవ తీసుకుని పార్కింగ్ ఫీజులు రద్దు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేసారు.అనంతరం మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కి వారు మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాజన్న తదితరులు పాల్గొన్నారు.